సాక్షి శ్రీకాకుళం

బుధవారం ; 3 ; సెప్టెంబర్ ; 2025



అరకొరగా ప్రసవాలు

టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రిలో ప్రసవాలు అరకొరగా జరుగుతున్నాయి. జనం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో..

వడ్డివాడ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ మహిళ మృతి చెందారు. - 8లో

మద్యం దుకాణంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి

సారవకోట: మండలంలోని బుడితి మద్యం దుకాణంపై మంగళవారం ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. ఈ మద్యం దుకాణంలో కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి జరిగినట్లు తెలుస్తోంది. దుకాణానికి సంబంధించిన వారు ఓ గది అద్దెకు తీసుకుని అక్కడ కల్తీ మద్యం తయారు చేస్తూ విక్రయిస్తున్నా రని గుర్తించినట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

డీఎస్సీలో మరో 12 మందికి కాల్ లెటర్లు

శ్రీకాకుళం: జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన మరో 12 మందికి మంగళవారం ఉదయం కాల్ లెటర్లు వచ్చాయి. వీరంతా మంగళవారం ఒంటిగంట నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకోవాలని సూచించారు. తొలుత 543 మందికి కాల్ లెటర్లు పంపించగా, ముగ్గురు ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో అనర్హులుగా తేలారు. మరో ముగ్గురు ఉద్యోగం చేపట్టేందుకు అయిష్టత వ్యక్తం చేశారు. ముగ్గురు వికలాంగ ధ్రువీకరణ పత్రంతో డీఎస్సీకి హాజరవ్వగా వారికి కూడా మంగళవారం కాల్ లెటర్లు పంపించారు. ఇలా 12 మందికి కాల్ లెటర్లు ఉదయం 8 గంటలకు పంపించి, మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని చెప్పడంతో దూరప్రాంతాల నుంచి రావాల్సిన వారు వ్యయ ప్రయాసలతో తీవ్ర ఇబ్బందులతో జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.

పిడుగు పడి ఒకరు మృతి



మృతి చెందిన ధవళ రమేష్

టెక్కలి: టెక్కలి మండలం పోలవరం గ్రామం సమీపంలో పంట పొలాల్లో పిడుగు పడి అదే గ్రామానికి చెందిన ధవళ రమేష్ (51) మంగళవారం మృతి చెందాడు. తన పొలంలో పనిచేస్తున్న కూలీల కోసం మధ్యాహ్న సమయంలో టీ తీసుకు వెళ్లిన రమేష్ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు వెతుకులాడారు. చివరకు పంట పొలాల్లో పడి ఉండడం గమనించారు. అయితే రమేష్ అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు రమేష్ పోలవరం మాజీ సర్పంచ్ ధవళ నారాయణరావు కుమారుడు. గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

వసతి గృహం విద్యార్థి అదృశ్యం



జగన్

జలుమూరు: బసివాడకు చెందిన వెలమల జగన్ అనే పదో తరగతి విద్యార్థి సోమవారం సాయంత్రం ఇంటి నుంచి నిమ్మాడ పాఠశాలకు వెళ్లి అదృశ్యమైనట్లు సర్పంచ్ బుద్దల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఇటీవల గణపతి నవరాత్రులకు ఇంటికి వచ్చిన జగన్ హాస్టల్‌కు వెళ్లి తర్వాత స్కూల్‌కు వెళ్తానని చెప్పి బయల్దేరాడు. కానీ హాస్టల్‌కు చేరలేదని, పాఠశాలకూ వెళ్లలేదని సర్పంచ్ తెలిపారు. తల్లిదండ్రులు గోవిందరావు, దమయంతిలు హైదరాబాద్‌లో తాపీ పనులు చేస్తున్నారని, విద్యార్థి అదృశ్యంపై స్థానిక పోలీసులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

విస్తారంగా జల్లులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో జిల్లాలో మంగళవారం జల్లులు కురిశాయి. ఈ వానలు మరో రెండు రోజులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. బుధ, గురువారాల్లో జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నెల 5 వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, పక్కనే డీపీఓ భారతీసౌజన్య

అరసవల్లి: నెలలో ప్రతి మూడో శనివారం కచ్చితంగా స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ పేరిట కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రమంలో జిల్లాలో పంచాయతీ అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ విస్తరణాధికారులు, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. జిల్లాలో చాలా పంచాయతీల్లో అపారిశుధ్య వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఆయా ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కొరవడుతుందని గుర్తించామన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ప్రజల నుంచి స్పందన సానుకూలంగా రావాలని, ఆ స్థాయిలో మీ పనితీరు కనిపించాలన్నారు.

మారాజుకు నీరాజనాలు



శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పెదపాడులోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం వైఎస్సార్ కూడలిలో..



వెనుకబడిన సిక్కోలును ప్రగతి పథంలో నడిపించేందుకు వైఎస్ రాజశేఖర రెడ్డి కృషి చేశారు. సిక్కోలుపై ఆయనది చెరగని ముద్ర. వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, ఎత్తిపోతల పథకాలు ఆయన చలవే. హిరమండలం రిజర్వాయర్ ద్వారా రెండు పంటలకు నీరందించేలా ఆలోచన చేశారు. రిమ్స్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ, బీఆర్ఏయూ ఏర్పాటు ఆయన కృషికి సజీవ సాక్ష్యాలు. - ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆమదాలవలస బ్రిడ్జి సమీపంలో..



పేదల గుండెల్లో వెలుగులు నింపి వారి హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన నాయకుడు వైఎస్సార్. ప్రతి వర్గానికి న్యాయం చేసేలా సంక్షేమాలు అందించిన నాయకుడు ఆయన మాత్రమే. ఆ వారసత్వాన్నే వైఎస్ జగన్ పుణికిపుచ్చుకుని సంక్షేమ పథకాలు అమలు చేశారు. 108, 104, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం తదితర కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాయి. - తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

పలాసలో



వైఎస్సార్ లేకపోవడం ఈ రాష్ట్రానికి తీరని లోటు. ఆయన మొదటిసారి సీఎం అయ్యాక జలయజ్ఞం పేరిట రైతులకు నీరిచ్చారు. అందులో భాగమే పలాసలోని ఆఫ్‌షోర్. ఆయన తర్వాత మళ్లీ వైఎస్ జగన్ మాత్రమే ఆ పనులు పునఃప్రారంభించారు. వైఎస్సార్ ఆశయ సాధనకు పుట్టిన పార్టీయే వైఎస్సార్‌సీపీ. - సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

మహా నాయకుడి మహాభినిష్క్రమణం జరిగి దశాబ్దం న్నర దాటిపోయింది. కానీ ఆ పలకరింపు ఎవరూ మర్చిపోలేదు. ఆ చిరునవ్వు ఎవరి జ్ఞాపకాలను దాటిపోలేదు. ఆరోగ్య శ్రీ ద్వారా మళ్లీ కొట్టుకున్న గుండెలు వైఎస్సార్ అనే మూడు అక్షరాలకు లక్షల సంవత్సరాల ఆయువు పోస్తున్నాయి. 108 ద్వారా నిలబడిన ప్రాణాలు ఆ రూపాన్ని శాశ్వతంగా మనసులో ప్రతిష్ఠించుకుంటున్నాయి. రిమ్స్‌కు వెళ్లి స్వస్థత పొందినా, బీఆర్ఏయూకు వెళ్లి చదువుకున్నా, హిరమండలం రిజర్వాయర్ గట్టుపై నిలబడి జలరాశిని చూసినా వైఎస్సార్ గుర్తుకు రాక మానరు. ఆయన వర్ధంతి సందర్భంగా సిక్కోలు యావత్తూ మారాజును స్మరించుకుంది. -సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



హిరమండలంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు



రణస్థలం: జె.ఆర్.పురం కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త పేరాడ తిలక్, నాయకులు



ఆమదాలవలస పట్టణంలోని లెప్రసీ కాలనీలో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు

అంతులేని అరాచకం

అడ్డుకోలేక ఆత్మార్పణం



- ఇంటి స్థలం విషయంలో టీడీపీ వర్గీయుల వేధింపులు
- తట్టుకోలేక వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్య

తాను ఇచ్చిన స్థలంలో కూతురు ఓ ఇల్లు కట్టుకుని హాయిగా బతికితే చూడాలని ఆ తండ్రి కలలు కన్నాడు. ఇటుక ఇటుక పేర్చి ఇల్లు కడుతుంటే చూసి ఆనందపడ్డాడు. ఇరుగు పొరుగు వారు రాజకీయ కక్షలతో విషం కక్కుతుంటే అన్నింటినీ భరించాడు. కూతురు, అల్లుడు సొంత గూటిలో ఉంటే చాలని తలిచాడు. కానీ అతడికి ఆ ఆనందం మిగలలేదు. నిర్మాణం పూర్తయిన ఇంటికి దారివ్వకుండా అడ్డుకున్నారు. ఏకంగా జేసీబీలు పెట్టించి మరీ తోవను తవ్వించేశారు. ఇన్ని వేధింపులను ఆ గుండె భరించలేకపోయింది. రోజు రోజుకూ పెరుగుతున్న అరాచకాన్ని చూసి ఆ తండ్రి తట్టుకోలేక పురుగు మందు తాగి తనువు చాలించాడు. సామాన్యుడిపై రాజకీయ కక్ష మరణంతో సమానమని ధర్మపురంలో జరిగిన ఈ ఘటన మళ్లీ రుజువు చేసింది. -పొందూరు



పోస్టుమార్టం గదిలో మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్ (ఇన్‌సెట్లో) మృతుడు వరహా నరసింహులు (ఫైల్)

పొందూరు మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మొదలవలస వరహా నరసింహులు(55) టీడీపీ వేధింపులు తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కూతురు అశ్వనికి ఇచ్చిన స్థలంలో సొంతంగా ఇల్లు కట్టుకుంటే.. పక్కనే ఉన్న టీడీపీకి చెందిన వారు మాటిమాటికీ తోవ విషయమై వివాదాలు రాజేసేవారు. రెండు మూడు సార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినా.. వారి వైఖరి మారలేదు. దీంతో ఆయన పురుగు మందు తాగి ప్రాణాలు వదిలేశాడు. రెండు నెలల కిందట ఇరు వర్గాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని, స్థల వివాదం విషయంలో అన్నెపు రాము ప్రోత్సాహంతో జరిగిన వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.



ప్రొక్లెయినర్‌తో తవ్వుతున్న దృశ్యం

జగన్ దృష్టికి తీసుకెళ్తా..

రిమ్స్‌లో వరహా నరసింహులు మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ పరిశీలించారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి, పార్టీ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్నారు.

అవమాన భారం తట్టుకోలేకే..



మా మామయ్య మొదలవలస వరహా నరసింహులు పసుపు కుంకాల కింద నా భార్యకు ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఇచ్చారు. హద్దులను వేసిన తర్వాత బండి దోవ ఉందని, ఇల్లు కట్టుకోవచ్చునని టీడీపీ నాయకుడు అన్నెపు రాము చెప్పాడు. దీంతో ఇంటిని ప్రారంభించి 50 శాతం పూర్తి చేశాం. ఆ స్థితిలో టీడీపీ కార్యకర్త అన్నెపు అసిరినాయుడు వచ్చి ఇబ్బందులు పెట్టాడు. మా ఇంటి ముందు కనిమెట్టకు చెందిన కుటుంబ సభ్యులతో కలిసి గోతులు తవ్వించాడు. దీంతో మళ్లీ అన్నెపు రాముని సంప్రదించాం. సమస్యను పరిష్కరించలేదు. వేరే పెద్ద మనుషుల సాయంతో తోవను చేసుకున్నాం. ఆ తర్వాతి రోజునే పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఇది జరిగి సుమారు రెండు నెలలు గడిచింది. వివాదాన్ని పరిష్కరించకుండా కొనసాగిస్తుండటంతో మా మామయ్య సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయారు. - గురుగుబెల్లి అన్నంనాయుడు, మృతుడి అల్లుడు, ధర్మపురం

టీడీపీ వేధింపులే కారణం



టీడీపీ నాయకుల వేధింపుల వల్లే నా తండ్రి చనిపోయారు. నేను కట్టుకున్న ఇంటికి తోవ ఇవ్వకుండా వేధించారు. జేసీబీతో గుంతలు తవ్వేశారు. అన్నెపు తులసమ్మ, శివాలు, అసిరినాయుడు, కృష్ణలు ఇంటిముందు జేసీబీతో తవ్వేశారు. పెద్దలను ఆశ్రయిస్తే తాము ఏం చేయలేమని అన్నెపు రాము చేతులెత్తేశాడు. అయితే వెనుక నుంచి మొత్తం నడిపించింది మాత్రం రామూనే. - గురుగుబెల్లి అశ్వని, మృతుడి కుమార్తె, ధర్మపురం

ఏపీఎల్ నుంచి ఇద్దరికి పిలుపు

- ఏసీఏ ఉమెన్ టీ-20 లీగ్‌కు నవ్య, వనజాక్షి ఎంపిక
- వైజాగ్ చీతాస్‌కు నవ్య, రాయలసీమ రాణీస్‌కు వనజాక్షి ప్రాతినిధ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: మూడునాలుగేళ్లగా నిలకడైన ఆటతీరుతో రాణిస్తున్న బూసి నవ్య, పనస వనజాక్షిలు ఏపీఎల్ నుంచి పిలుపు అందుకున్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పటిష్టమైన వైజాగ్ చీతాస్ జట్టుకు నవ్య ప్రాతినిధ్యం వహించనుండగా, రాయలసీమ రాణీస్ జట్టుకు వనజాక్షి ప్రాతినిధ్యం వహిస్తుంది. విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఈ టోర్నీ త్వరలో మొదలుకానుంది. జిల్లా నుంచి వీరిద్దరూ ఉమెన్ ఏపీఎల్‌కు ఎంపిక కావడంపై జిల్లా క్రికెట్ సంఘం(జెడ్‌సీఏ) అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, కౌన్సెలర్ డాక్టర్ ఎస్.రవికుమార్, సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రికెటర్లు సంతోషం వ్యక్తంచేశారు.

జాతీయ జట్టుకు ఎంపికే లక్ష్యంగా..



నరసన్నపేట మండలం అడవినారాయణ వలస గ్రామానికి చెందిన బూసి నవ్య అనతికాలంలో రాష్ట్రస్థాయిలో విశేషంగా రాణిస్తుంది. దూరవిద్య ద్వారా డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రైటార్మ్ ఆఫ్ స్పిన్ బౌలర్‌గా గుర్తింపు అందుకున్న నవ్య బ్యాటింగ్ కూడా చేయగలదు. ఇప్పటికే అండర్-16లో ఒకసారి, అండర్-19లో మూడుసార్లు, అండర్-23లో రెండుసార్లు ఆంధ్రా జట్టుకు ఎంపికైంది. తాజాగా వైజాగ్ చీతాస్ జట్టుకు ఎంపికైంది. ఈ టోర్నీలో రాణించడంతోపాటు జాతీయ జట్టుకు ఎంపికే తన జీవిత లక్ష్యంగా నవ్య అడుగులు వేస్తోంది.

కూతురి కోసం కూలి పనులు చేస్తూ..



వనజాక్షి స్వస్థలం కొత్తూరు మండలం నేతాజీ కాలనీ. తల్లిదండ్రులు పనస రమేష్, పుణ్యావతి. వీరిద్దరు గృహ నిర్మాణ శ్రామికులు. కుమార్తెను ఉన్నతంగా చూడాలని కూలిపనులకు వెళ్తూ చదివిస్తున్నారు. ప్రస్తుతం వనజాక్షి శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే కళాశాల మైదానంలో క్రికెట్ నెట్స్ లో శిక్షకులు కిల్లి సుదర్శన్, అన్నెపు ఆనంద్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది. రైటార్మ్ ఆఫ్ స్పిన్ బౌలర్‌గా వనజాక్షి 2023, 2025 రెండుసార్లు ఆంధ్రా స్టేట్ ప్రాబబుల్స్‌కు ఎంపికైంది. మూడుపర్యాయాలు జోనల్‌స్థాయిలో ప్రాతినిధ్యం వహించింది. ఏపీఎల్‌లో రాణించి అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యేందుకు కఠోర సాధన చేస్తోంది.

స్వచ్ఛాంధ్ర అవార్డులు సాధిస్తే ప్రోత్సాహకాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు అధిక సంఖ్యలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు వచ్చేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అవార్డులు గెలుచుకున్న వారికి రూ.లక్ష రివార్డు, జిల్లా స్థాయి అవార్డులకు రూ.25 వేల వరకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 2న జరిగే ఈ కార్యక్రమంలో స్వచ్ఛ మున్సిపాలిటీలు, పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైతుబజార్లు, హాస్టల్స్, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, స్వచ్ఛత వారియర్స్ తదితర విభాగాల్లో రాష్ట్రస్థాయిలో 52, జిల్లాస్థాయిలో 1,421 కలిపి మొత్తం 1,473 అవార్డులు ప్రభుత్వం ఇవ్వనుందని వివరించారు. ఇందులో జిల్లా నుంచి అధిక సంఖ్యలో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

యూరియా కొరత రాకూడదు..

జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కృత్రిమ కొరత నివారించేందుకు అగ్రికల్చర్, కో-ఆపరేటివ్, మార్క్‌ఫెడ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు.

యూరియా కొరతపై 9న వైఎస్సార్‌సీపీ ఆందోళనలు

నరసన్నపేట: రైతుల కష్టాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన జిల్లాలోని పలాస, టెక్కలి డివిజన్‌లలో వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేపట్టనుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి, పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మబగాంలో వీరు విలేకరులతో మాట్లాడారు. రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతుల పక్షాన వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు 9న పలాస, టెక్కలిలో అధికారులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. కార్యక్రమంపై చర్చించేందుకు మాజీ మంత్రి అప్పలరాజు, టెక్కలి సమన్వయకర్త పేడాడ తిలక్ మంగళవారం మబగాంకు వచ్చారు. కృష్ణదాస్ మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఎరువులు, విత్తనాలు సహా అన్నీ సులభంగా లభించేవని, కానీ ఇప్పుడు యూరియా సరఫరాలో తీవ్ర లోపం కనిపిస్తోందని అన్నారు. వచ్చిన యూరియా రైతులకు ఇవ్వకుండా టీడీపీ నాయకులు పక్క దారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.



వైకుంఠపురం గ్రామంలో యూరియా కోసం రైతుసేవా కేంద్రం ఎదురుగా నిరీక్షిస్తున్న రైతులు



జి.సిగడాం: యూరియా కోసం నిరసన తెలుపుతున్న రైతులు

యూరియా కోసం రైతుల నిరసన

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయకపోవడంతో మంగళవారం సర్వేశ్వరపురం కూడలి వైఎస్సార్ విగ్రహం వద్ద రైతులు నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు యూరియా అందించాలని వారు కోరారు.

నిలబడాల్సిందేనా..?

బూర్జ: వైకుంఠపురం గ్రామ రైతు సేవా కేంద్రానికి ప్రభుత్వం నుంచి 91 బస్తాల యూరియా వచ్చింది. మంగళవారం వైకుంఠపురంతో పాటు, కొరగాం బొడ్డపాడు, ఉప్పినివలస పరిసర గ్రామాల రైతులు యూరియా కోసం క్యూ కట్టారు.

వైద్య శిబిరం ఏర్పాటు

టెక్కలి రూరల్: చింతలగారలో జ్వరాల విజృంభణపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మేరీ కేథరిన్ ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలానే గ్రామంలోని మంచినీటి నమూనాలు సేకరించారు.

సాక్షి ఎఫెక్ట్...



గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


మృతిచెందిన రెయ్యమ్మ

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం వడ్డివాడ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మురపాల రెయ్యమ్మ(45) అనే మహిళ మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగి రామారావు, మురపాల రెయ్యమ్మలు కలసి ద్విచక్ర వాహనంపై బోరుభద్ర నుంచి సంతబొమ్మాళి వైపు వెళ్తుండగా అదే సమయంలో ముందు వెలుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెయ్యమ్మ, రామారావులతో పాటు మరో బైకుపై ఉన్న నెయ్యల రామకృష్ణకు సైతం గాయాలయ్యాయి. ముగ్గురినీ కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రెయ్యమ్మ మృతిచెందింది. సంతబొమ్మాళి ఎస్‌ఐ సింహాచలం మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరకొరగా ప్రసవాలు

- టెక్కలి జిల్లా ఆస్పత్రిలో తగ్గుతున్న సాధారణ కాన్పులు
- నెలకు 200 ప్రసవాలు జరగాల్సి ఉన్నా 80 దాటని వైనం
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణులు

టెక్కలి రూరల్ :

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య ఆశించిన మేర పెరడగం లేదు. ప్రధానంగా సాధారణ ప్రసవాల సంఖ్య తక్కువగా నమోదవుతోంది. ప్రాంతీయ ఆస్పత్రి నుంచి జిల్లా ఆస్పత్రిగా మారినప్పటికీ వైద్యసేవల్లో మాత్రం ఏమీ మార్పు రాలేదని, గతంలో మాదిరిగానే అరకొరగా సేవలు అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా సీరియస్ కేసు వస్తే వెంటనే శ్రీకాకుళం రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. జిల్లా ఆసుపత్రి కావడంతో పలాస, మెళియాపుట్టి, మందస, సోంపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి కేసులను టెక్కలి రిఫర్ చేస్తుంటే.. అందులో చాలా కేసులను ఇక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేస్తుండటంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే జిల్లా ఆస్పత్రిగా స్థాయి పెంచడం దేనికని ప్రశ్నిస్తున్నారు. అయితే, ఇక్కడి వైద్యులు మాత్రం సరైన పరికరాలు లేకపోతే తామేం చేస్తామంటూ వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

టెక్కలి జిల్లా ఆసుపత్రిలో సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, ఇద్దరు అసిస్టెంట్ సివిల్ సర్జన్‌లు ఉన్నారు. వీరందరు మహిళ వైద్యులే. రోజుకు సుమారు 500పైగా వస్తున్న ఓపీలో 50కి పైగా ప్రసూతి విభాగానివే, అందులో 40 మంది వరకు గర్భిణులు వివిధ రకాల పరీక్షలు చేయించుకుంటున్నారు.

జనవరి నుంచి జూలై వరకు కాన్పుల వివరాలు

నెల	సాధారణ కాన్పు	సర్జరీ	మొత్తం
జనవరి	28	49	77
ఫిబ్రవరి	19	45	64
మార్చి	23	53	76
ఏప్రిల్	28	44	72
మే	16	56	72
జూన్	29	51	80
జూలై	23	57	80


టెక్కలి జిల్లా ఆస్పత్రి


వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులు

అయినప్పటికి కాన్పుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. వివిధ కారణాల వల్ల నెలకు సుమారు 200 వరకు కాన్పులు జరగాల్సి ఉండగా ప్రస్తుతం 80 కూడా దాటడం లేదు. అందులో సాధారణ కాన్పులు 30కు మించకపోవడం గమనార్హం.

స్థానికులు ఏమంటున్నారంటే..

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులే ప్రైవేట్ క్లినిక్‌లు నడిపించడం వల్ల వైద్యులు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు.

- గర్భిణులను ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకొచ్చాక ఆపరేషన్‌కు, బొడ్డు కొయ్యడానికి, ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు, వార్డుకు తీసుకువెళ్లేందుకు.. ఇలా ప్రతిదానికీ కొందరు డబ్బులు అడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముర్రుపాలు పట్టించడానికి కూడా డబ్బులు తీసుకుంటున్నారని పలువురు చెబుతున్నారు.
- కాన్పుకు ముందు చేయాల్సిన పరీక్షలన్నీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకుని ప్రసవానికి మాత్రం ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారని, ఇందులో కొందరు సిబ్బంది పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ప్రసవం అయ్యాక బాలింతలకు పూర్తిస్థాయిలో బెడ్‌లు లేవు.

చర్యలు తీసుకుంటాం..

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో డబ్బులు తీసుకుంటున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు చేపడతాం. ఆస్పత్రిలో వార్డులు కొన్నిసార్లు సరిపడటం లేదన్న విషయం వాస్తవమే. దానికి తగ్గట్టుగా ఆరోగ్యం బాగున్న వారిని వేరే వార్డులోకి షిఫ్ట్ చెయ్యిస్తున్నాం

– బి.సూర్యారావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, టెక్కలి

సమస్యలు పరిష్కారమయ్యేనా...

- నేడు టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి సలహా సమావేశం
- గత ఏడాది ప్రస్తావించిన సమస్యలు నేటికీ పరిష్కారం కాని వైనం

టెక్కలి: టెక్కలిలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు వేధిస్తున్నాయి. పేరుకు పెద్దాసుపత్రి అయినప్పటికీ సేవల విషయంలో రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం విషయంలో పాలనా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ఆసుపత్రిలో వైద్యులు మొదలుకొని దిగువ స్థాయి సిబ్బంది కొరతతో పాటు మరి కొన్ని మౌలిక సదుపాయాలు లేకపోవడంతో సేవలు అరకొరగానే అందుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఆస్పత్రిలో అభివృద్ధి సలహా సమావేశం నిర్వహించనున్నారు. గత ఏడాది ఆగస్టు 1న మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో ఆస్పత్రి అభివృద్ధి సలహా సమావేశం నిర్వహించారు. అప్పట్లో పలు సమస్యలపై విన్నవించారు. వాటిలో ఆశించిన స్థాయిలో పరిష్కారం కాలేదు. ఈసారైనా చర్యలు చేపడతారో లేదో చూడాలి.

ప్రధాన సమస్యలివే...

టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో పాటు నర్సింగ్ సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నాయి. డెర్మటాలజీ, జనరల్ మెడిషిన్, రేడియాలజీ, జనరల్ సర్జన్, ఎనస్తీషియా, ఆర్ఎంఓ, డీసీఎస్ జనరల్, సీఏఎస్ జనరల్ వైద్యులు కలిపి 10 మంది వైద్యులు అవసరం. 15 మంది స్టాఫ్ నర్స్‌ల కొరత వేధిస్తోంది. జీడీఏలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అటెండర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాంగణంలోనే మార్చురీ విభాగం ఉండడంతో మృత దేహాల భద్రత జటిలమైన సమస్యగా మారింది. సరైన మురుగు వ్యవస్థ లేకపోవడంతో ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు నీరు ప్రవహిస్తోంది.


టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మురుగు నీరు

బీసీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా, నియోజకవర్గాల, మండల కమిటీలు ఏర్పాటు చేసి గ్రామగ్రామాన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జెండా ఎగిరేలా కృషి చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 130 బీసీ కులాల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీసీ విద్యార్థుల వసతి గృహాల సమస్యల నుంచి జాతీయస్థాయిలో జనగణన, కుల గణన చేసేవరకు అనేక సమరశీల పోరాటాలు చేసి విజయాలు సాధించగలిగామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి చందు బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. సమావేశంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, జిల్లా నాయకులు రత్నాల మురళీమోహన్‌రావు, బగాది రమణమూర్తి, రాయల రాము, రాజమహంతి భానుచందర్, గానుగుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


ఎరువుల దుకాణం వద్ద విజిలెన్స్ బృందం

గార : రామచంద్రాపురం పరిధిలోని నవజ్యోతి, దుర్గా ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. దుర్గా షాపు లైసెన్సు రెన్యువల్ ఇంకా జరగకపోవడాన్ని గుర్తించారు. నిల్వ ఉన్న 5.50 మెట్రిక్ టన్నుల డీఏపీ, ఎంవోపీ, సాయిల్ కండీషనర్ ఎరువుల అమ్మకాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా విజిలెన్సు సీఐ డి.వి.వి.సతీష్‌కుమార్, వ్యవసాయాధికారి డి.పద్మావతిలు మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు అమ్మినా, అదనపు ఎరువులతో లింక్‌పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రంలో వికృత పాలన


సింగుపురం మోహన్‌రావు

టెక్కలి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వికృత పాలన కొనసాగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతున్నారని న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగుపురం మోహన్‌రావు మండిపడ్డారు. టెక్కలిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో 'సాక్షి' పత్రికపై విషం కక్కే విధంగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డీఎస్పీ, ఏఎస్పీ పదోన్నతుల్లో సీనియర్ పోలీస్ అధికారులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపిన 'సాక్షి'పై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలోకి అక్రమంగా చొరబడి భయాందోళన కలిగించే విధంగా ప్రవర్తించారని గుర్తు చేశారు. తాజాగా మరోసారి సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసు నమోదు చేశారని తెలిపారు. పత్రికల భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా దుందుడుకు చర్యలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు, హైకోర్టులు హెచ్చరిస్తున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు తెగబడుతోందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు న్యాయ స్థానాల మార్గదర్శకాలను పరిహాసం చేయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గంజాయి నేరస్తులపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన, పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డివిజన్లు, సర్కిళ్లు, స్టేషన్ల వారీగా అధికారులతో సమీక్షించారు. గంజాయి కేసుల దర్యాప్తు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు, పెండింగ్ కారణాలపై ఆరా తీశారు. ఎస్పీతోపాటు డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

హోంగార్డు కుమారుడికి అభినందనలు..

పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో హోంగార్డు చక్క వాసుదేవరావు కుమారుడు శశిధర్‌నాయుడు నీట్ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ సీటు పొందడంతో ఎస్పీ అభినందించారు.

అండర్-23 క్రికెట్ జట్టులో హరీష్




హిరమండలం: అండర్-23 విభాగంలో ఓ సంస్థ నిర్వహించే టీ-20 క్రికెట్ మ్యాచ్‌లు ఆడేందుకు టీమిండియాలో గొట్టా గ్రామానికి చెందిన బత్తుల హరీష్ చోటు సంపాదించాడు. నేపాల్‌లో డిసెంబర్ నుంచి జరగనున్న అంతర్జాతీయ టోర్నీలో హరీష్ దేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. దీంతో హరీష్‌ను గ్రామపెద్దలతో పాటు గ్రామస్తులు అభినందించారు.

గొంతు కోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో కోరాడ గవరయ్య

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన కోరాడ గవరయ్య (35) మంగళవారం ఉదయం పదునైన చాకుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది.

లక్ష్మమ్మకు సత్కారం


లక్ష్మమ్మను సన్మానిస్తున్న ఆర్మీ అధికారి, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: సుమారు 50 ఏళ్లగా ఎంతోమందికి పురుడు పోసిన అంబటి లక్ష్మమ్మ సేవలు వెలకట్టలేనివని విశ్రాంత ఆర్మీ అధికారి కొయిరి ప్రసాదరావు అన్నారు. మంగళవారం వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటలోని చిన్న వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మమ్మ సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. వైద్యం అందుబాటులో లేని సమయంలో ఉద్దాన, తీర ప్రాంత గ్రామాల్లో ప్రసవ వేదనలో ఉన్న ఎంతో మంది గర్భిణులకు అండగా నిలిచి ప్రతికూల పరిస్థితుల్లో తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గాత ముకుందరావు, కె.కొర్లయ్య, కాంతారావు, దాలయ్య, సాధు తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో ఏఎస్‌ఐ అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: అనారోగ్యంతో మృతి చెందిన పోలాకి ఏఎస్‌ఐ పి.ఆదినారాయణకు మంగళవారం నరసన్నపేటలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పోలాకి ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. నరసన్నపేట, పోలాకి పోలీసుస్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం తిలారు-కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 ఏళ్ల పైబడి ఉంటుందని, చేతిపై శ్రీను అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. రైలు నుంచి జారి పడి మృతిచెందాడా.. మరేదైనా కారణం ఉందా అనేది తెలియడం లేదు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు పేర్కొన్నారు.

• ఆటోడ్రైవర్లకు బాసటగా..



ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో మంగళవారం ఆమదాలవలసలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా తమ్మినేని కాసేపు ఆటో నడిపారు. స్త్రీ శక్తి పథకం నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. – ఆమదాలవలస